సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం తోపాటు చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలు అంటే కాలయాపన కేంద్రాలు అనే నానుడిపోయి సంపూర్ణ ఆరోగ్య కేంద్రాలుగా అవతరించాయి.


అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న మార్పులకు శ్రీకారం

జి.కొండూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల్లో రుచికరమైన మెనూతో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అదేవిధంగా ప్రతి నెలా పోషకాహార కిట్లను బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందజేస్తోంది. అంతే కాకుండా కిచెన్‌గార్డెన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పోషక విలువలతో కూడిన ఆకుకూరలు, కూరగాయలను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఉత్పత్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాలు నిర్వహించడం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలపై విశ్వసనీయతను పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై అవగాహన కార్యక్రమాల ను నిర్వహిస్తున్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలపై ఆసక్తి చూపని ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన వినూత్న కార్యక్రమాలతో అంగన్‌వాడీ కేంద్రాలను ఆరోగ్య దేవాలయాలుగా భావిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

మైలవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వివరాలు

మండలం	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు (3సం॥ లోపు)	చిన్నారులు (3–6 సం॥)
మైలవరం	436	414	1,837	1,181
జి.కొండూరు	379	325	1,559	849
ఇబ్రహీంపట్నం	617	533	2,483	1,108

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో నెలకు అందించే పోషకాహారం

పోషకాహారం	కిలో గ్రాములలో	చిన్నారులకు
రాగిపిండి	1కేజీ	25 కోడిగుడ్లు
జొన్న, సజ్జ పిండి	1కేజీ	2.5 లీటర్ల పాలు
అటుకులు	1కేజీ	2.5 కేజీల బాలామృతం
బెల్లం	250 గ్రా	
వేరుశనగ చిక్కి	250 గ్రా	
ఎండు కర్జూరం	250 గ్రా	

మైలవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	మినీ కేంద్రాలు
మైలవరం	5	3
జి.కొండూరు	55	6
ఇబ్రహీంపట్నం	63	5

ప్రీ స్కూలు ఎడ్యుకేషన్ అమలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూలు ఎడ్యుకేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు ప్రీస్కూలు ఎడ్యుకేషన్ కిట్లను అందజేయడంతో పాటు పీపీ1, పీపీ2 మెటీరియల్‌ను సైతం అందజేసి బోధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు నూతన బోధనా విధానంతో ప్రీ స్కూలు కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీల నిర్వహణలో రాజీలేదు



ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాం. గర్భిణులు బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించడంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నాం. ప్రీ స్కూలు ఎడ్యుకేషన్‌ను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నాం. అదేవిధంగా కిచెన్ గార్డెన్ కార్యక్రమాన్ని ప్రారంభించి అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మునగాకు, ఆకుకూరలను ఉత్పత్తి చేసేందుకు చర్యలు చేపట్టాం.
– పుష్పలత, సీడీపీఓ, మైలవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్

ఆహార నియమావళితో వ్యాధుల దూరం

మైలవరం: ఆహార నియమావళితో రోగాలకు దూరంగా ఉండవచ్చని డాక్టర్ గ్రంధి సత్యప్రశాంత్ తెలిపారు. స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో మండల ఆర్య వైశ్య సంఘం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో విజయవాడ కేరళ ఆయుర్వేద పంచకర్మ క్లినిక్ సౌజన్యంతో ఉచిత ఆయుర్వేద నాడీ వైద్య పరీక్ష శిబిరం ఆదివారం నిర్వహించారు. దీర్ఘ కాలిక వ్యాధులైన వెరికోస్, మొండి వ్యాధులు, చర్మ వ్యాధుల నివారణకు జబ్బు తగ్గడానికి ఆహార నియమాలు పాటించాలన్నారు. డాక్టర్ సత్య ప్రశాంత్ వైద్య పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేసి, మందులు అందజేశారు.

రూ.27 లక్షలతో పైపులైన్ల పనులు

ఆంజనేయపురం(తిరువూరు): జలజీవన్ మిషన్ నుంచి మంజూరైన రూ.27 లక్షలతో మండలంలోని ఆంజనేయపురంలో తాగునీటి పైపులైన్ల ఏర్పాటు పనులు ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ మామిడి కుటుంబరావు ఈ పనులను ప్రారంభించగా, గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారుల పర్యవేక్షణలో గ్రామంలో పైపులైన్ల ఏర్పాటు చేపట్టారు. వేసవిలో గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

ఇబ్రహీంపట్నం: కేర్ స్పెషాలిటీ కినిక్ వారి సహకారంతో ఇబ్రహీంపట్నంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరంలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు రత్నకాంత్, ప్రముఖ చర్మవ్యాధులు నిపుణురాలు డాక్టర్ బి.రోషిణీ, ఈఎన్‌టీ వైద్యులు బి.గోపి, జనరల్ సర్జన్ డాక్టర్ సునీత శిబిరానికి హాజరైన 200మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు.

నేడు 'స్పందన'

నూజివీడు: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారం నిమిత్తం అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు.

రేపటి నుంచి శ్రీరామ నవమి వేడుకలు

చాట్రాయి: మండలంలోని చనుబండలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన కోదండ రామాలయంలో ఈ నెల 28 నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు కల్యాణ వేడుకలు నిర్వహించనున్నారు. 28 ఉదయం శ్రీరాముడిని పెండ్లి కుమారుడిని చేయడం, 29న ఎదురుకోలు (వధూవరుల) అన్వేషణ, 30న సీతారాముల కల్యాణం, 31న మహా పట్టాభిషేకం, అన్న సమారాధన, రాత్రి 12 గంటలకు రథోత్సవం, ఏప్రిల్ 1న వసంతోత్సవం, 2న రాత్రి స్వామి వార్ల పవళింపు సేవతో నవమి వేడుకలు ముగియనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్న కేశవరెడ్డి తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు 3,478 మంది విద్యార్థులు

నూజివీడు : వచ్చేనెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు నూజివీడు డివిజన్ నుంచి 3,478 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు డీవైఈఓ సేవియా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూజివీడు మండలం నుంచి 1,789 మంది, ముసునూరు నుంచి 619 మంది, ఆగిరిపల్లి నుంచి 599 మంది, చాట్రాయి మండలం నుంచి 471 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమస్యాత్మక కేంద్రాలలో ఈ దఫా సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. కేవలం చీఫ్ సూపరింటెండెంట్‌లు మాత్రమే సెల్ ఫోన్లు తీసుకెళ్లాలన్నారు.

మామిడి, పొగాకు రైతులను ఆదుకోండి

నూజివీడు: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టం జరిగిందని, మామిడి, పొగాకు ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. నూజివీడులోని అమర్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా ఉద్యాన వన పంటలైన మామిడి, అరటి, ఆహార పంటలైన మొక్కజొన్న, వాణిజ్య పంటలైన పొగాకు, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఆహార పంటలకు ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య, ఉద్యాన పంటలకు రూ. లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

ఎ.కొండూరు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో చీమలపాడులో ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివ నాగమణి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు దోచిపెడుతోందని విమర్శించారు. నాయకులు పి.ఆనందరావు, అంబిరెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోదండరామయ్య సన్నిధిలో ఎమ్మెల్యే


స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

ముసునూరు : ఇటీవల ధ్వజ స్తంభ, విగ్రహ, శిఖర, బొడ్డురాయి ప్రతిష్ఠ జరిగిన చెక్కపల్లిలోని కోదండ రామాలయం, సీతాలక్ష్మణాంజనేయ సహిత రామ మందిరాన్ని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దర్శించుకున్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నేతలతో కలసి ఆదివారం ఆయన చెక్కపల్లిలోని కోదండ రామాలయానికి చేరుకున్నారు. అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆయనను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి వారి దర్శనం చేయించారు. అనంతరం చర్చికి వెళ్లి ప్రార్థనాశీస్సులు స్వీకరించారు. అక్కడకు చేరువలో ఉన్న పూర్తిగా పాడైపోయిన రహదారిని పరిశీలించి, తక్షణమే రహదారి నిర్మాణం చేపట్టాలని పీఆర్ ఏఈ తిరుమలశెట్టి నరసింహారావును ఫోన్‌లో ఆదేశించారు. ఇటీవల పూరిల్లు దగ్ధమైన బాధితురాలు కఠారి వీరమ్మకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, ఎంపీటీసీ తోట రమాదేవి మురళి, ఉప సర్పంచ్ చిలుకూరి పద్మజా దేవేంద్ర, రైతు సలహా సంఘ జిల్లా కార్యదర్శి పల్లె రవీంద్రరెడ్డి, ఆలయ ధ్వజ స్తంభ దాత మాదల మదన్‌మోహన్ పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల జాబితాను సిద్ధం చేయండి

నూజివీడు: ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దెబ్బతిన్న పంటల వివరాలను, నష్టపోయిన రైతుల జాబితాలను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. నూజివీడు ఏడీఈ విద్యాసాగర్‌తో పాటు వ్యవసాయాధికారులతో దెబ్బతిన్న పంటల విషయమై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే పంట నష్టపోయిన రైతుల జాబితాను నాలుగు మండలాల్లోని వ్యవసాయాధికారులు త్వరితగతిన, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, రైతు సలహామండలి నియోజకవర్గ చైర్మన్ పల్లె రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

అసెంబ్లీ తీర్మానం హర్షణీయం

మైలవరం: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదించడం చారిత్రక ఘట్టమని వసంత ఫౌండేషన్ చైర్మన్, క్రిస్టియన్ మైనారిటీ మైలవరం నియోజకవర్గం అధ్యక్షుడు బుర్రి ప్రతాప్ తెలిపారు. మైలవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బుర్రి ప్రతాప్ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నపుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి అసెంబ్లీలో దళిత క్రైస్తవులను గుర్తించి బిల్లు ప్రవేశపెట్టినపుడు ఆనాడు కేంద్రం పట్టించుకోకుండా పెండింగ్ పెట్టిందని పేర్కొన్నారు. తండ్రిని మించిన తనయుడుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రైస్తవులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలోని దళిత క్రైస్తవులు మనస్సులో చిర స్థాయిగా నిలిచిపోతారన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేయడం దళిత క్రైస్తవులకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. క్రిస్టియన్ మైనార్టీ మండల అధ్యక్షుడు రెవరెండ్ సాల్మన్‌రాజు, రెవరెండ్ బుద్దే సీమోను, పాస్టర్ వై.ప్రభుదాస్, ఎం.దేవానందం, పాస్టర్ డి.రాజేష్, పాస్టర్ వైజాన్, పాస్టర్ బెంజిమెన్ పాల్గొన్నారు.

బొబ్బిలి సేవలు చిరస్మరణీయం


బొబ్బిలి కొండలరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడుబొబ్బిలి కొండలరావు సంస్మరణ సభ పట్టణంలోని కృష్ణ విలాస్ కళావేదికలో ఆదివారం నిర్వహించారు. నూజివీడు స్పోర్టింగ్ క్లబ్, బాస్కెట్ బాల్ వెటరన్ క్రీడాకారులు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొని కొండలరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూజివీడు క్రీడా రంగానికి బొబ్బిలి కొండలరావు చేసిన సేవలు మరువలేనివని, ఆయన లోటు తీర్చలేనిదని అన్నారు. ఇంటెలిజెన్స్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీనివాసరావు, డీఏఆర్ కళాశాల చైర్మన్ మెహర్ రామ్ వెంకట అప్పారావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీపతిరాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ఆర్థిక ఆసరా

నూజివీడు : పొదుపు చేసుకోవడమే కాకుండా, తీసుకున్న రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతోన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత నగదును వారి ఖాతాల్లో జమచేసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తరువాత క్రమం తప్పకుండా అమలు చేస్తూ స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు ఆసరా నిధులను జమచేసిన రాష్ట్ర ప్రభుత్వం మూడోసారి సైతం జమచేసి మాట ఇస్తే మడమ తిప్పేది లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారు. ఎన్నికల నాటికి ఉన్న డ్వాక్రా సంఘాల అప్పును నాలుగు విడతల్లో తీరుస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఘనత సీఎం జగన్ దేనని మహిళలు పేర్కొంటున్నారు.

నియోజకవర్గంలో 5,108 సంఘాలకు రూ.46.76 కోట్ల లబ్ధి

వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా మూడో విడతలో నియోజకవర్గంలోని 5,108 సంఘాలకు రూ.46.76 కోట్లను స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. 53,149 మంది మహిళలకు ఈ మొత్తం జమ కానుంది.

నేడు వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల

మైలవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు వైఎస్సార్ ఆసరా నిధులు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ విడుదల చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకట్రావు తెలిపారు. రెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఆసరా నిధులు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ విడుదల చేస్తారని పార్టీ కార్యాలయం తెలిపింది.

నేటి నుంచి చెక్కుల పంపిణీ

తిరువూరు: వైఎస్సార్ ఆసరా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని డ్వాక్రా మహిళలకు పంపిణీ చేసే కార్యక్రమం సోమవారం నుంచి జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. 27న విస్సన్నపేటలో, 29న ఏకొండూరులో, 31న తిరువూరులో, ఏప్రిల్ 1న గంపలగూడెంలో జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రక్షణ నిధి పాల్గొంటారని పేర్కొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను సోమవారం నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పంపిణీ చేయనున్నట్లు వెలుగు ఏపీఎం శేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కె.రక్షణనిధి పాల్గొంటారని పేర్కొన్నారు.

మొక్కజొన్న పైరు నష్టంపై సర్వే

గంపలగూడెం: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మొక్కజొన్న పైరు నష్టంపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మండలంలో సర్వే నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బీ సాయిశ్రీ ఆదివారం తెలిపారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 650 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేసినట్లు పేర్కొన్నారు. సాగు చేసి ఇప్పటికి 70రోజులు పూర్తవుతుండగా వర్షాల కారణంగా కొన్ని గ్రామాల్లో పైరు నేలవాలిందని తెలిపారు. నెమలి, ఊటుకూరు, పెనుగొలను, గంపలగూడెం, మేడూరు, కొణిజెర్ల గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది, వీఏఏ, వీహెచ్ఏలతో సర్వే చేపట్టినట్లు ఏఓ పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతులు తమ గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల్లో సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.

రూ.50 వేల చోరీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బ్యాంక్ సెంటర్ పాలబూత్‌లో సినీ పక్కీలో చోరీ జరిగింది. శేఖర్ అనే వ్యక్తి కొన్నేళ్లుగా విజయా డెయిరీ పాలబూత్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున డెయిరీ సిబ్బంది వాహనంలో వచ్చి పాల పదార్థాలు దిగుమతి చేశారు. తిరుగు ప్రయాణంలో నగదు తీసుకెళ్లారని భావించిన యజమాని వారి కోసం రూ.50 వేలు సిద్ధం చేసి పేపర్‌లో చుట్టి బూత్‌లోని ఓ బుట్టలో పెట్టాడు. వ్యాపారుల నిమిత్తం బైటకు వచ్చి న మరు క్షణం ఇద్దరు వ్యక్తులు ఆ నగదు దోచుకెళ్లారు. ఇది గమనించిన స్థానికులు కేకలు వేయగా బైక్‌పై పరారయ్యారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సీసీ కెమెరా పుటేజీ పరిశీలించగా నిందితులు ఆ చోరీకి 10 నిమిషాల ముందు అక్కడే తిరిగినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

తిరువూరు: రోజూ క్రమం తప్పకుండా సైక్లింగ్ చేస్తే శారీరక, మానసిక ఒత్తిడి లేకుండా జీవించవచ్చని తిరువూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లూరి రామకోటేశ్వరరావు అన్నారు. ఆదివారం తిరువూరులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైక్లింగ్ ప్రాధాన్యతను తెలియజేస్తూ 12కే సైక్లింగ్ కార్యక్రమం నిర్వహించారు.

విలువలు కాలరాస్తున్న బీజేపీ

మైలవరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలు కాలరాస్తోందని కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటు ప్రకటించడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. మైలవరం నూజివీడు రోడ్డులోని మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలు నిరసన దీక్ష చేపట్టారు.

ఇంటిపన్ను వసూలుపై స్పెషల్ డ్రైవ్

విజయవాడరూరల్: ఇంటిపన్ను వసూలులో ప్రజలు ప్రభుత్వానికి సహకరించి వెంటనే చెల్లించాలని డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ) కె.చంద్రశేఖరావు విజ్ఞప్తి చేశారు. ఇంటిపన్ను వసూలుపై స్పెషల్ డ్రైవ్‌ను పైడూరుపాడు, రాయనపాడు గ్రామాల్లో డీఎల్‌పీఓ, ఈఓఆర్డీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడూరుపాడులో రూ.22 వేలు, రాయనపాడులో రూ.12వేలు వసూలు చేశారు. కార్యక్రమంలో పైడూరుపాడు సర్పంచ్ వి.సీతారామయ్య, ఈఓఆర్డీ బీవీ శేషగిరావు, గ్రామ కార్యదర్శి స్వరూపారాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాయి భక్తుల భిక్షాటన

తిరువూరు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక షిర్డిసాయి మందిర భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఉగాది నుంచి ప్రారంభమైన నవమి ఉత్సవాల్లో అఖండ సాయి సప్తాహం నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 30న సీతారాముల కల్యాణం, 31న అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా హైస్కూల్ వార్షికోత్సవం

ఆగిరిపల్లి : మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో గల చుక్కపల్లి హైస్కూల్ 21వ వార్షిక వేడుకలు శనివారం రాత్రి అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఎంఈఓ రత్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలు చేరుకోవాలన్నారు. అనంతరం హైస్కూల్ కరస్పాండెంట్ చుక్కపల్లి సుధ ఆధ్వర్యంలో 2022 పది పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన తులసి, హర్షిక, కోటేశ్వరరావుకు రూ.20 వేల నగదు బహుమతితో పాటు రూ.25 వేలు విలువ చేసే ట్యాబ్‌లను అందజేశారు.

నేడు 104 వాహనాలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

నూజివీడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు గాను ప్రస్తుతం ఉన్న 104 వాహనాలకు అదనంగా మరో రెండు వాహనాలను నూజివీడుకు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రెండు వాహనాలను సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించనున్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ముసునూరు: బలివేలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, యువకులు, మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి శనివారం రాత్రి క్షీరాభిషేకం చేశారు. ముసునూరు–పెదవేగి మండలాలను అనుసంధానిస్తూ జల వనరుల శాఖ నిధులతో బలివేలోని తమ్మిలేరుపై నిర్మించ తలపెట్టిన చెక్ డ్యామ్ కమ్ డబుల్ లేన్ బ్రిడ్జి నిర్మాణానికి శనివారం దెందులూరులో జరిగిన మూడో విడత ఆసరా, ప్రారంభ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దీంతో మండల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ దాసి రాటాలు సుమన్, బలివే ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

హెల్మెట్‌ను ధరించి జీవితాలను కాపాడుకోవాలి

కనిమెర్ల తండా(మైలవరం): హెల్మెట్‌ను విధిగా ధరించి ద్విచక్ర వాహన చోదకులు తమ జీవితాలను కాపాడుకోవాలని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు పేర్కొన్నారు. ఆ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల దత్తత గ్రామం కనిమెర్ల తండాలో ఆదివారం రెండో రోజు స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. హెల్మెట్ వినియోగం, రోడ్డు ప్రమాదాలు నివారణ అనే అంశంపై గ్రామ ప్రజలకు ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై పీ రాంబాబు మాట్లాడుతూ హెల్మెట్ విధిగా ధరించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.